31012025-DIS-04_Layout 1 1/31/2025 3:24 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

మెడికల్ పీజీ సంకటం

ఈ రోజుల్లో ఎంబీబీఎస్ మాత్రమే చేస్తే వైద్య విద్య చదివినట్టు కాదు. పీజీ సర్టిఫికెట్ జోడింపు ఉంటేనే గుర్తింపు, గౌరవమే కాదు.. ఉద్యోగమూ లభిస్తుంది. కానీ మెడికల్ పీజీ విద్యాపకశాలు రాష్ట్ర విద్యార్థులకు అంతకంతకూ తగ్గిపోతుండటం ఆందోళన కలిగిస్తున్నది. స్థానికత ఆధారంగా కల్పించే రిజర్వేషన్లను తాజాగా సుప్రీంకోర్టు రద్దు చేయడంతో విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లినట్టయింది. జనవరి 29న వెలువరించిన ఆ తీర్పులో స్థానికత అనే ప్రాతిపదిక రాజ్యాంగం ప్రకారం 'ఆమోదయోగ్యం కాదని' సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. చట్టం ముందు అందరూ సమానులేననే రాజ్యాంగంలోని 14వ అధికరణానికి స్థానిక కోటా విరుద్ధమని తెలిపింది. సుదూర పర్యవసానాలతో కూడిన ఈ తీర్పుతో తెలంగాణ వైద్య ప్రవేశాల రూపురేఖలే మారిపోతాయి. వచ్చే ఏడాది నుంచి స్థానిక కోటా లేకుండానే ప్రవేశాలు కల్పించాల్సి ఉంటుంది.

దార్శనిక నేత కేసీఆర్ రాష్ట్ర పగ్గాలు చేపట్టగానే వైద్యవిద్యపై ప్రత్యేక దృష్టి పెట్టారు. రాష్ట్రంలో నాణ్యమైన వైద్యసేవలు అందుబాటులోకి తేవాలంటే వైద్యవిద్యా వ్యవస్థ విస్తరణే మార్గమని ఆలోచించారు. వైద్య విద్య కేవలం రాజధాని ప్రాంతానికే పరిమితం కారాదని, ప్రతి జిల్లాకు ఒక వైద్య కళాశాల ఉండాలని సంకల్పించారు. ఎన్నో వ్యయప్రయాసల కోర్చి ఆగమేఘాల మీద వాటిని అభివృద్ధి చేశారు. ఫలితంగా రాష్ట్రంలో వైద్యవిద్యా వ్యవస్థ అంచెలంచెలుగా ఎదిగింది. స్వరాష్ట్రం ఏర్పడే నాటికి కేవలం 5 మాత్రమే ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలల సంఖ్య ఇప్పుడు 33కు పెరిగిందంటే అది కేసీఆర్ దూరదృష్టి వల్లనే సాధ్యపడిందనేది ప్రత్యక్ష సత్యం. ఉన్నత వైద్యవిద్య కూడా అన్నిచోట్లా అందుబాటులోకి తేవాలనే సదాశయంతో పీజీ అప్‌గ్రేడ్ కూడా ప్రవేశపెట్టారు. వైద్యవిద్యకు వైద్యశాలల అనుబంధం తప్పనిసరి. దాంతో దవాఖానల ఆధునీకరణ కూడా చేపట్టారు. ధనిక-పేద, పట్టణ-గ్రామ అనే తేడాలు సమసిపోయి అందరికీ డాక్టరు చదువు అందుబాటులోకి వచ్చింది. దీనినే తెల్లకోటు విప్లవమని కూడా పిలుస్తున్నారు. ఇప్పుడు స్థానికత అనేది తొలగిస్తే పరిస్థితి తారుమారవుతుంది. కేసీఆర్ కలలు కన్న ఆరోగ్య తెలంగాణ ఆగమాగం అవుతుంది. ప్రాంతీయ ప్రయోజనాల కోసం కొట్లాడి సాధించుకున్న రాష్ట్రంలో స్థానికతే లేకుండా పోవడం పెద్ద సమస్యే.

సుప్రీం తీర్పు వల్ల తెలంగాణతో పాటు యావత్ దక్షిణాదిపై ప్రభావం పడుతుంది. స్థానికత లేకుండా చేస్తే ఉత్తరాది వారికి అవకాశాలు పెరిగి, దక్షిణాది వారికి అవకాశాలు తగ్గిపోతాయి. అత్యాధునిక వైద్య విద్యా వ్యవస్థలను అభివృద్ధి చేసిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లోని స్థానిక విద్యార్థులు అవకాశాలు కోల్పోవాల్సి వస్తుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఎక్కువ నష్టం జరుగుతుందనేది మరో వాదన. ఎంబీబీఎస్ పూర్తిచేసి గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే 'ఇన్ సర్వీస్' అభ్యర్థుల కోటా కూడా రద్దయిపోతుంది. మొత్తంగా రాష్ట్రంలో వైద్యసేవల నాణ్యత, అందుబాటు అనేవి కూడా క్రమంగా తగ్గిపోతాయి. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తగిన స్థాయిలో మదింపు జరిపి, రాజ్యాంగ ధర్మాసనానికి అపీలు చేయడంతో సహా అన్ని ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సి ఉన్నది.

ప్రచ్ఛన్న యుద్ధం ముంగిట్లో ప్రపంచం

అస్నాల శ్రీనివాస్
96522 75560

'మానవజాతి భవిష్యత్తు ప్రమాదంలో పడింది. ఇది అనివార్యమైన, తప్పించుకోలేని, భయానక వాస్తవం మన కండ్లముందు కనపడుతున్నది. మన ముందు రెండు ప్రత్యామ్నాయాలున్నాయి. ఒకటి మానవ జాతి పూర్తిగా నశించడం. రెండవది కొంత వివేకం, జ్ఞానంతో, కొత్త రాజకీయ ఆలోచనలతో యుద్ధాలను ఆపేసి ఈ విపత్తును శాశ్వతంగా నివారించడం. తద్వారా ప్రకృతిని సుస్థిర రీతిలో కాపాడుకోవడం'..

మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాల్లో కోట్లాది ప్రజల మరణం, తీవ్ర ఆస్తి, ఆవరణ వ్యవస్థ విధ్వంసం నుంచి ప్రపంచం తేరుకోకుండానే అమెరికా, రష్యా అగ్రరాజ్యాల మధ్య ప్రపంచ ఆధిపత్య పోరు ప్రారంభమైంది. ప్రచ్ఛన్న యుద్ధం తీవ్రతరమవుతున్న కాలంలో మానవ వైజ్ఞానిక చరిత్రను తన శక్తి నిత్యత్వ సూత్రం ద్వారా మార్చిన శాస్త్రవేత్త, మానవతావాది ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, తత్వవేత్త బెర్ట్రాండ్ రస్సెల్ నేతృత్వంలో 1955, జూలై 7న తమ పేర్లతో ప్రకటించిన ప్రణాళికలో ప్రస్తావించిన మాటలు.

2025, జనవరి 20న అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన డొనాల్డ్ ట్రంప్ తొలి ప్రసంగంలో వెలువరించిన ఆదేశాలు శాంతి కాముక పౌర సమాజాన్ని కలవరానికి గురిచేశాయి. ఫాసిజం, ప్రచ్ఛన్నయుద్ధ తీవ్రతను అనివార్యం చేసే దిశలో ట్రంప్ కార్యాచరణ కనిపిస్తున్నది. కోల్పోయిన అమెరికా ప్రాభవాన్ని తిరిగి పొందేందుకు కృషిచేస్తానని చెప్పారు. తీవ్ర జాతీయవాదం, విద్వేషపూరిత ప్రసంగాలు, రాజకీయాలతో రెండవసారి అధికారంలోకి వచ్చిన ట్రంప్ వలసలపై ఉక్కుపాదం మోపేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో అమెరికా ఆధిపత్యం కొనసాగాలని అమెరికా ఫస్ట్ నినాదాన్ని బలంగా వినిపించారు.

ఇంకా తన ప్రసంగంలో విస్తరణ వాదాన్ని, చైనాపై ప్రత్యక్ష అక్కసును వ్యక్తం చేశారు. చైనా ప్రభావాన్ని తగ్గించే దిశగా పనామా కాల్వ స్వాధీనం గురించి మాట్లాడారు. పలు యూఎన్ ఏజెన్సీల నుంచి వైదొలుగుతున్నట్టు తెలిపారు. ఏక ధ్రువ ప్రపంచాన్ని ద్వి ధ్రువ ప్రపంచంగా మారుస్తున్న చైనాతో చాప కింద నీరుగా కొనసాగుతున్న ప్రచ్ఛన్న యుద్ధం మరింత తీవ్రరూపం దాల్చే ప్రమాదం ఉన్నదని నిపుణుల అంచనా.

డబ్ల్యూహెచ్‌వో నుంచి త్వరలో వైదొలుగుతామని ప్రకటించారు. ఈ సంస్థ చైనా కనుసన్నలలో కార్యక్రమాలను నిర్వహిస్తున్నదని అలాంటి సంస్థ తమకు అక్కరలేదన్నారు. ఈ సంస్థకు వచ్చే నిధులలో 18 శాతం అమెరికా నుంచి వస్తున్నాయి. కానీ, అది చైనా పట్ల పక్షపాత ధోరణితో వ్యవహరిస్తుందని ఆరోపణ చేశారు. వాస్తవానికి చైనా ప్రాణాలను కాపాడే అత్యవసర మందుల తయారీకి కావాల్సిన రసాయనాల ప్రాసెసింగ్‌లో పై చేయి సాధించింది. ఆ మందులను డబ్ల్యూహెచ్ వో ద్వారా ప్రపంచానికి అందుబాటులో ఉంచటంలో కీలక పాత్ర పోషించింది. తన 'అమెరికా ఫస్ట్' విజన్‌కు భిన్నమైన అంశం కాబట్టి ట్రంప్ ఆ నిర్ణయాన్ని ప్రకటించారు. ఏదేమైనా అమెరికా నిధులు ప్రపంచవ్యాప్తంగా హెచ్ఐవీ, టీబీ, ఇతర సాంక్రామిక, అసాంక్రామిక వ్యాధుల చికిత్సలో కీలక పాత్ర పోషించాయి. అమెరికా లేని డబ్ల్యూహెచ్‌వోలో కార్యక్రమాలతో మూడవ ప్రపంచ దేశ ప్రజలు ఇబ్బందులకు గురయ్యే స్థితి సంభవిస్తుంది.



ఇదిలా ఉంటే.. జనవరి 24న దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో వర్చువల్‌గా మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలకు హెచ్చరికతో కూడిన ఆహ్వానం పలికారు. అమెరికాలో తక్కువ పన్నులతో తమ వస్తువుల ఉత్పత్తిని చేపట్టాలని లేకపోతే పలు ఆంక్షలు, అధిక టారిఫ్‌లు ఎదుర్కోవాల్సి వస్తుందని మందలించారు. తమ దేశ వ్యవసాయ ఉత్పత్తులపై అధిక పన్నులు విధిస్తున్న యూరోపియన్ యూనియన్‌కు, పొరుగుదేశం కెనడాకూ హెచ్చరిక చేశారు. ఈయూ కీలక దేశాలైన జర్మనీ ఛాన్సలర్ కోఫ్జా, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ ఘాటుగా ప్రతిస్పందించారు. తనదైన సొంత జ్ఞానం సాంకేతికత, పారిశ్రామిక విధానాలతో బలిష్ఠమైన శక్తిగా తమ ఐరోపా సమాజం ఎదుగుతుందని, నిలబడుతుందన్నారు. కెనడా ప్రధాని అదే రకమైన సమాధానం చెప్పారు.

పారిస్ వాతావరణ ఒప్పందం నుంచి వైదొలగి సుస్థిర, సమ్మిళిత అభివృద్ధి స్ఫూర్తికి భిన్నంగా వ్యవహరిస్తున్నది. ప్రపంచ వాణిజ్య సంస్థ అపిల్లేట్ అథారిటీ నుంచి యునెస్కో, ట్రాన్స్ పసిఫిక్ భాగస్వామ్య ఒప్పందం నుంచి ఇలా పలు వేదికల నుంచి వెలుపలికి వస్తానని ట్రంప్ చెప్తూ వస్తున్నారు. జీవశాస్త్ర సంబంధ లోపాలతో జనించిన ట్రాన్స్‌జెండర్స్ హక్కుల రద్దు, డెన్మార్క్ నుంచి గ్రీన్‌ల్యాండ్ ద్వీపాన్ని లాక్కోవడం వంటి ప్రకటనలు యుద్ధ మేఘాలకు, ఆర్థిక పర్యావరణ సంక్షోభానికి దారితీస్తాయి. భూ తాపాన్ని పెంచుతున్న వాయు ఉద్గారాల విడుదలలో అమెరికా రెండవ పెద్ద దేశం. 2030 వరకు ఈ వాయువుల విడుదల తగ్గించే లక్ష్యాలలో 1/3 వంతు మాత్రమే సాధించింది. పరిహారంగా పేద దేశాలకు ఇవ్వాల్సిన నిధులను ఇవ్వకుండా పారిస్ ఒప్పందం నుంచి వైదొలిగింది.

బెర్ట్రాండ్ రస్సెల్-ఐన్‌స్టీన్ ప్రణాళిక (1955) వెలుగులో అంతర్జాతీయ సమాజం ప్రకృతిని, ప్రజలను హననం చేసే పలుర కాల చర్యలను నిరోధించటానికి అనేక ఒప్పందాలు జరిగాయి. అణ్వస్త్ర తగ్గింపు ఒప్పందం, సముద్ర గర్భాన్ని, అంతరిక్షంను యుద్ధ కార్యక్రమాలకు వాడకూడదని ఒప్పందం, హానికర రసాయన ఆయుధాల వాడక నిషేధం, ఓజోన్ తగ్గింపు, క్యోటో ప్రోటోకాల్, సముద్ర ప్రాదేశిక జలాల న్యాయ ఒప్పందం మొదలైన వాటిపై ప్రపంచ దేశాలు సంతకం చేసి ఏదోమేరకు గౌరవిస్తూ తీవ్ర ఆర్థిక సంక్షోభం, మూడవ ప్రపంచయుద్ధ భారిన పడకుండా కాపాడాయి. ట్రంప్ నేతృత్వంలోని అమెరికా వీటిని ఖాతరు చేయకుండా ఉండే వైఖరిని ప్రదర్శిస్తున్నది.

1930లో ఆర్థిక మాంద్యానికి అమెరికా విధించిన టారిఫ్‌లు, వాణిజ్య ఆంక్షలు కారణమయ్యాయి. అనేక దేశాల స్థూల దేశీయోత్పత్తి పడిపోయింది. ఫలితంగా చెలరేగిన అశాంతిని హిట్లర్ వంటి ఫాసిస్ట్ శక్తులు ఉపయోగించుకొని జాతి విద్వేషాలను, జాతీయ దురభిమానాలను రెచ్చగొట్టి మానవ, ప్రకృతి హననానికి దారితీశాయి. పరిపాలనలో, ప్రసంగాల్లో హిట్లర్ నమూనాను అనుసరిస్తున్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. తన క్యాబినెట్‌లో 14 మంది బిలియనీర్‌లను తీసుకున్నాడు. కుబేరుడు ఎలన్ మాస్క్ హిట్లర్ తరహా అభివాదం చేశాడు. కొద్దిమంది కుబేరుల ప్రయోజనాల కోసం ప్రపంచ ప్రజల ప్రయోజనాలను పణంగా పెట్టే ప్రయత్నాలు చేస్తున్నాడు.

అమెరికా మూలవాసులు రెడ్ ఇండియన్‌లు. మిగతా ప్రజలు ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చినవారే. అమెరికా అభివృద్ధిలో అన్ని ఖండాల మేధో, శ్రామిక ప్రజల భాగస్వామ్యం ఉన్నది. ఈ వాస్తవికతను విస్మరిస్తూ రాజకీయ అధికారం కోసం తనవైపు లేని ప్రజలను ఆక్రమిత నేరస్థులని, గ్రహాంతర వాసులని అవమానిస్తూ దేశ ప్రజల మధ్య వైషమ్యాలను రెచ్చగొడుతున్నారు.

డొనాల్డ్ ట్రంప్‌ను ఉద్దేశించి యురేషియా కన్సల్టింగ్ సంస్థ అధ్యక్షుడు ఇయాన్ బ్రెమ్మెర్ ప్రపంచానికి ప్రమాదకరమైన వ్యక్తి అని హెచ్చరించాడు. చరిత్రను వెనక్కి నెట్టివేసే ఈ ధనికస్వామ్య ఫాసిస్ట్ ఏకధ్రువ వ్యవస్థ విధానం మానవాళి మనుగడకు ముప్పుగా పరిణమిస్తుంది. ప్రపంచ పోలీస్‌గా చెలామణి అవ్వడం అమెరికాకు అత్యంత దురాశ అవుతుంది. చైనా, రష్యా, ఇవి సభ్యదేశాలుగా ఉన్న బ్రిక్స్ కూటమి, యూరోపియన్ యూనియన్, ఆసియాన్ వంటి పలు కూటములు ప్రపంచాన్ని బహుళ ధ్రువంగా మార్చాయి.

ఈ నేపథ్యంలో అమెరికా దూకుడు యుద్ధ ఉద్రిక్తతలకు, ఆర్థిక విధ్వంసానికి దారి తీస్తుంది. దీన్ని నిలువరించడానికి, నిరోధించడానికి ఆసియా వెలుగుగా, ప్రపంచ వెలుగుగా నిలిచిన బుద్ధుడు జన్మించిన ఈ నేల నుంచి సామ్రాజ్యవాద, విస్తరణవాద, ధనిక స్వామ్య వ్యతిరేక పోరాటాలు ప్రారంభమవ్వాలి. గాంధీతో ప్రభావితులైన ప్రపంచ వైజ్ఞానిక ప్రగతిని మహా గొప్ప మలుపు తిప్పిన మహనీయులు ఆల్బర్ట్ ఐన్‌స్టీన్-బెర్ట్రాండ్ రస్సెల్‌లు ప్రకటించిన శాంతి సహా జీవన ప్రణాళికకు 75 ఏండ్లు నిండాయి. ఈ వెలుగులో నెహ్రూ అలీన విధానంలో మూడవ ప్రపంచ దేశాలు మానవ భవిష్యత్తును సంక్షోభంలో నెట్టివేస్తున్న అమెరికా ఏకస్వామ్య ప్రయత్నాల నిరోధానికి ఐక్య సంఘటనగా ఏర్పడటం ఒక చారిత్రక అవసరం.

(వ్యాసకర్త: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం)

నమ్మినోళ్లను నట్టేట ముంచిన కాంగ్రెస్

ఓ. నరసింహారెడ్డి
80080 02927

మోసానికి మారుపేరు కాంగ్రెస్. వంచనకు కేరాఫ్ అడ్రస్ హస్తం పార్టీ. నమ్మినవాళ్లను ముంచడంలో ఆ పార్టీ దిట్ట. వెంట నడిచిన వాళ్ల వెన్ను విరవడం ఆ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య. తెలంగాణ రాష్ట్రంలో తొలి కాంగ్రెస్ ప్రభుత్వం రావడానికి సహకరించిన వారిని కూడా ఆ పార్టీ వదలడం లేదు. అందులో భాగంగానే తమకు ఓట్లు వేసి గెలిపించిన వారిని నానా ఇబ్బందులకు గురిచేస్తున్నది. పార్టీ జెండా మోసిన వాళ్లను నిండా ముంచుతున్నది. ఏరికోరి మరీ కాంగ్రెస్‌ను గద్దెనెక్కించిన వర్గాలనే మొదట దెబ్బకొడుతున్నది.

'నమ్మి నానవోస్తే పుచ్చి బుర్రలైనట్టు' ఉన్నది ప్రస్తుత తెలంగాణ గ్రామీణ ప్రజల పరిస్థితి. కాంగ్రెస్ పాలనలో రైతన్నల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలిచింది గ్రామీణ ప్రాంతాల్లోనే. కేసీఆర్ సర్కార్ కంటే ఇంకా ఎక్కువే చేస్తారని అమాయకంగా నమ్మిన గ్రామీణ ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేశారు. తీరా అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ తన నైజాన్ని బయటపెట్టుకున్నది. అన్నదాతను ఆగమాగం చేస్తున్నది. కొత్త పథకాల సంగతి పక్కనపెడితే ఉన్న పథకాలను ఊడగొట్టింది. కేసీఆర్ సర్కార్ గుట్టలకు, పుట్టలకు రైతుబంధు ఇచ్చిందని సాకులు చెబుతూ పెట్టుబడి సాయానికి పంగనామం పెట్టింది. బీఆర్ఎస్ ప్రభుత్వం పుట్టలకు, గుట్టలకు రైతుబంధు ఇచ్చిందో, లేదో తెలియదుగానీ, స్వేదం చిందించి సేద్యం చేసే ప్రతి రైతన్నకు రంచనుగా సాయం అందించి పెట్టుబడి వెతలు తీర్చింది. కానీ, ఏడాది నుంచి బుర బుద్దలు కొట్టుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి లెక్క తేలడం లేదు. ఇప్పటికే ఒక సీజన్ ఎగ్గొట్టింది. ఎకరానికి రూ.15,000 ఇస్తామని బాకాలు ఊది, ఇప్పుడు రూ.12 వేలే ఇస్తామంటూ మోసానికి పాల్పడింది. అది కూడా గణతంత్ర దినోత్సవం రోజున. ఆ రోజు జరిగిన సభలో 15 నిమిషాల వ్యవధిలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండు మాటలు మాట్లాడారు. మొదట అర్ధరాత్రి నుంచి ఫోన్లు మోగుతాయని చెప్పి, ఆ తర్వాత మార్చి 31 వరకు సాయం సొమ్ము వేస్తామని మాట మార్చేశారు. తమ ఫోన్లు ఎప్పుడు మోగుతాయోనని రైతన్నలు కండ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. మరోవైపు, కరెంటు కోతలు కర్షకులను ఇబ్బంది పెడుతున్నాయి. రుణమాఫీ అరకొరగా చేశారు. రైతుబీమా సాయం కూడా ఆగిపోయింది. నీళ్ల గోస మళ్లీ మొదలైంది. యూరియా తిప్పలు తప్పడం లేదు. దీంతో ఏరికోరి మరీ నెత్తిన శనిని కూర్చోబెట్టుకున్నామని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

కాంగ్రెస్ సర్కార్ ముంచిన మరో వర్గం యువత. హస్తం పార్టీ మాయమాటలు నమ్మిన నిరుద్యోగులు ఎన్నికల వేళ మూడు రంగుల జెండాను భుజాలపై మోశారు. ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. కానీ, వారు ఆశించినట్టుగా ఇటు రెండు లక్షల ఉద్యోగాలు రాలేదు, అటు నిరుద్యోగ భృతి కూడా దక్కలేదు. జీవో 46 బాధితులను కూడా కాంగ్రెస్ పార్టీ వాడుకొని నడిరోడ్డుపై వదిలేసింది. చదువుకునే యువత డిగ్రీలు, పీజీలు పూర్తి చేయగానే ఆర్థిక సాయం చేస్తామని కాంగ్రెస్ నాయకులు చెప్పారు. కానీ, ఇప్పుడు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్‌లు కూడా రాకపోవడంతో వారి చదువులు ఆగిపోయే పరిస్థితి వచ్చింది. పైగా ఉద్యోగాల కోసం నిలదీస్తున్న నిరుద్యోగులకు లాఠీచార్జీలు, కేసులు బోనస్‌గా దక్కాయి. ఈ నేపథ్యంలో నిరుద్యోగులు కాంగ్రెస్ ప్రభుత్వంపై గుర్రుగా ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ చేతిలో ఆర్టీసీ, ఆటో డ్రైవర్లు కూడా దారుణంగా మోసపోయారు. ఎన్నికలకు ముందు ఏ ఆటో చూసినా మూడు రంగుల జెండా పాటే వినిపించేది. ఇప్పుడు ఆటో డ్రైవర్లకు ఆ పాట వింటేనే చిర్రెత్తుకొస్తున్నది. ఇక, ఆర్టీసీ కార్మికుల బాధ వర్ణనాతీతం. కోరి తెచ్చుకున్న సర్కార్ ఇప్పుడు వారి కొంపలు ముంచింది. కేసీఆర్ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయగా కాంగ్రెస్ సర్కార్ రాగానే దాన్ని అటకెక్కించింది. అంతేకాదు ఇప్పుడు ఆర్టీసీని నిర్వీర్యం చేసే కుట్రలు పన్నుతున్నది. ఒక్కొక్కటిగా డిపోలను ప్రైవేటుపరం చేస్తున్నది. రానున్న రోజుల్లో ఆర్టీసీని పూర్తిగా ప్రైవేటు కంపెనీలకు అప్పగించే కుయుక్తులు పన్నుతుండటంతో కార్మికులు సమ్మె హారన్ మోగించాల్సి వచ్చింది.

మహిళలకు ఒకే ఒక్క ఉచిత బస్సు పథకాన్ని అమలుచేసిన ప్రభుత్వం మిగతా అన్నింటికీ ఎగనామం పెట్టింది. రూ.2,500 ఆర్థిక సాయం మాటే లేదు. 500 రూపాయల గ్యాస్ ఊసే లేదు. టీచర్లు, ప్రభుత్వ ఉద్యోగులను కూడా కాంగ్రెస్ ఘోరంగా మోసం చేసింది. ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చి ఇప్పుడు కనీసం ఉద్యోగ సంఘాలకు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదు. వారికి న్యాయంగా దక్కాల్సిన పెండింగ్ డీఏలను కూడా విడుదల చేయడం లేదు. ఆర్థికపరమైన హామీలను పక్కన పెడితే, కనీసం సాధారణ హామీలను కూడా నెరవేర్చడం లేదు.

ఉద్యమకారుల పేరు చెప్పుకొని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆ వర్గాన్ని కూడా నిండా ముంచింది. కాంగ్రెస్ ఎన్నో హామీలు ఇవ్వడంతో వారు కూడా ఆ పార్టీకి మద్దతుగా నిలిచారు. ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇల్లు, ఆర్థికపరమైన సాయం చేస్తామని హస్తం నాయకులు హామీ ఇవ్వగా, వాటిలో ఏ ఒక్కటీ ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో వర్గాలు కాంగ్రెస్ హామీలకు బలయ్యాయి.

నమ్మి ఓట్లు వేసిన వర్గాలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ తమకు ఓట్లేయని వర్గాలను, ప్రాంతాలను విడిచిపెడుతుందా? నమ్మిన వర్గాలను ఒకే విధంగా మోసం చేస్తే.. నమ్మని వర్గాలు, ప్రాంతాలకు అసలు భవిష్యత్తే లేకుండా చేస్తున్నది. హైదరాబాద్‌లో జరుగుతున్న విధ్వంసమే అందుకు చక్కని ఉదాహరణ.



అమ్మాయిల కోసం డ్రగ్స్ తీసుకున్నా..

"నేను టీనేజ్‌లో ఉన్నప్పుడు చాలా ప్రయోగాలు చేశా. అమ్మాయిల్ని ఆకట్టుకునేందుకు నిషేధిత ఎల్ఎస్‌డీ, గంజాయి రుచిచూశా. అయితే, ఎల్ఎస్‌డీ అనుభవం నన్ను భయపెట్టింది. దీంతో ఆ తర్వాత ఎప్పుడూ వాటికి జోలికి పోలేదు."

- బిల్‌గేట్స్, మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు

సమాజం అవసాన దశలో ఉన్నప్పుడు సమాజాన్ని చైతన్యం చేసేది మేధావులు. అలాంటి మేధావులు మౌనంగా ఉంటే సమాజాభివృద్ధి కుంటుపడుతుంది. ప్రభుత్వ తప్పులను ప్రశ్నించే బాధ్యత మేధావులపై ఉంటుంది. కానీ నేటి ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలమవుతున్నా ఈ మేధావులు కిమ్మనకుండా ఉంటున్నారు. వారికి ప్రభుత్వ వైఫల్యం కనిపించటం లేదా?

మేధావులెక్కడ?



తెలంగాణ రాష్ట్ర సాధనలో మేధావుల పాత్ర ప్రధానమైన దే కాకుండా ప్రేరణాత్మకమైనది కూడా. ఈ ఉద్యమంలో మేధావులు తమ ఆలోచనలు, రచనలు, ప్రసంగాలతో ఉద్యమాన్ని బలోపేతం చేశారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అనంతరకాలంలో ఈ మేధావులు ప్రభుత్వ విధానాలపై పలు విమర్శలు చేశారు. పలు రంగాల్లో ప్రభుత్వం విఫలమైందని విమర్శలు చేశారు. 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఈ విజయంలో మేధావుల పాత్ర కీలకంగా నిలిచింది. వారు కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ఉన్న వాగ్దానాలను ప్రజలకు వివరించి కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో కీలక పాత్ర పోషించారు. ఇంతవరకు బాగానే ఉంది. కానీ, కాంగ్రెస్ పథకాల అమలు విషయంలో మేధావులు ఇప్పుడు మౌనంగా ఉండటం అందరినీ విస్మయానికి గురిచేస్తున్నది. మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, యువ వికాసం, చేయూత వంటి పథకాలు అమలు కావడం లేదు.

రాష్ట్రంలో నిరుద్యోగం ఒక పెద్ద సమస్యగా మారింది. ప్రభుత్వ హామీలు అమలు కాకపోవడంతో నిరుద్యోగులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. 2 లక్షల ఉద్యోగాల జాడలేదు, నిరుద్యోగ భృతి లేదు. రైతు భరోసా, రైతుబీమా లేదు. రుణమాఫీని అరకొరగా చేసి వదిలేశారు. బోనస్ బోగస్ అయింది. రైతు ఆత్మహత్యలు పెరిగిపోయాయి. 24 గంటల ఉచిత కరెంటు లేదు, పంటకు మద్దతు ధర లేదు. ప్రభుత్వం రైతులను ఇన్ని రకాలుగా గోస పుచ్చుకుంటున్నా ఈ మేధావులు ఎందుకు ప్రశ్నించడం లేదనేది పెద్ద ప్రశ్న.

మూసీ సుందరీకరణ పేరుతో దాని చుట్టుపక్కల దాదాపు 15 వేల ఇండ్ల కూల్చివేతకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. ఆ కుటుంబాలకు అండగా ఉండి ధైర్యం చెప్పే మేధావి లేకపోయాడు. హైడ్రా బాధితులు ప్రభుత్వం నుంచి ఇప్పటికీ సాయం పొందలేకపోతున్నారు. ఆటో కార్మికుల పరిస్థితి కూడా దుర్భరంగా ఉంది. ఎన్నికల ముందు ఆటో కార్మికులకు నెలకు రూ.12,000 ఇస్తామని చెప్పి అధికారంలో వచ్చాక ఆ దిశగా ప్రయత్నం చేపట్టలేదు. పలువురు ఆటో కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారు. అయినా ఒక్క మేధావీ నోరెత్తడం లేదు. ఆశావర్కర్లు, మాజీ సర్పంచ్‌ల సమస్యలు ప్రభుత్వ ప్రామాణికతను దెబ్బతీసే విషయాలు. పింఛన్లు రాకపోవడంతో వృద్ధుల పరిస్థితి దారుణంగా మారింది. అయినా మేధావులు మౌనంగా ఉన్నారు తప్పితే ప్రభుత్వాన్ని ప్రశ్నించడం లేదు. నాడు కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించి గడప గడపకు తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం కోసం పనిచేసిన మేధావులు నేడు తెలంగాణ రాష్ట్రం ప్రమాదంలో ఉంటే కనీసం మాట్లాడకపోవడం బాధాకరం. మేధావి మౌనం సమాజానికి చాలా ప్రమాదం.

రాజేష్ నాయక్
96035 79115

(వ్యాసకర్త: రీసెర్చ్ స్కాలర్, ఓయూ)